క్లుప్తంగా

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ



ధ్వజస్తంభానికి పూజలు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని కల్లెపెల్లిలోని వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. యంత్ర ప్రతిష్ఠ, పల్లకిసేవ నిర్వహించారు. అనంతరం స్వామి కల్యాణాన్ని అర్చకులు కనుల పండువగా నిర్వహించారు. సమీప గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

కేసీఆర్, హరీశ్‌రావు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని కమ్మర్లపల్లి గ్రామ మధిర కొండెంగలకుంట గ్రామ శివారులోని కుమ్మరికుంట గోదావరి జలాలతో నిండి మత్తడి దూకడంతో ఆదివారం గ్రామస్తులు కేసీఆర్, ఎమ్మెల్యే హరీశ్‌రావుల ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. హరీశ్‌రావు ప్రత్యేక చొరవతోనే రంగనాయకసాగర్ నుంచి కాలువల ద్వారా కుమ్మరికుంట నిండిందని సంతోషం వ్యక్తం చేశారు. కొన్నేళ్లుగా బీడుగా ఉన్న కుంట ప్రస్తుతం మండుటెండలో కూడా నిండు కుండలా మారడంతో హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాణిక్యరెడ్డి, ఉపాధ్యక్షుడు పాపయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కాల్వ ఎల్లయ్య, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న భక్తులు

మిరుదొడ్డి(దుబ్బాక): అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో పోచమ్మతల్లి ఆలయ రెండో వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు బోనాల జాతర, మంగళహారతులతో సామూహిక పూజలు చేశారు. ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకొన్నారు. అనంతరం భక్తులు అన్నదానం చేశారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సుజాత

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని దేవక్కపల్లెలో బాలవికాస సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ సుజాత మాట్లాడుతూ తీవ్రమైన ఎండలతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులకు గురికాకూడదనే ఉద్దేశ్యంతో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వాటి ఏర్పాటుకు ఆర్థికంగా సహకరిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బాలవికాస ప్రతినిధులు, సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భక్తులకు ముత్యాల తలంబ్రాలు



రామకోటి రామరాజుకు తలంబ్రాలను అందజేస్తున్న ఏఈఓ శ్రావణ్

గజ్వేల్‌రూరల్: భద్రాచల సీతారాముల కల్యాణోత్సవంలో వినియోగించిన ముత్యాల తలంబ్రాలను గజ్వేల్ ప్రాంత భక్తులకు పంపిణీ చేసేందుకు ఆ ఆలయ అధికారులు రామకోటి భక్తసమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజుకు ఆదివారం అందించారు. ఈ సందర్భంగా ఆ ఆలయ ఏఈఓ శ్రావణ్ మాట్లాడుతూ గజ్వేల్ ప్రాంతంలో రామకోటి సంస్థ ద్వారా చేపట్టిన కార్యక్రమాలు అభినందనీయమని, మూడేళ్లుగా తలంబ్రాలను గోటితో వలిచి అందించడం ఆనందంగా ఉందన్నారు. గజ్వేల్ ప్రాంత భక్తులకు అందించేందుకు 100 కిలోల తలంబ్రాలను అందజేశారని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీఐ.. అందుబాటులోకి

ఫలించనున్న ఏడేళ్ల కల

- నత్తనడకన సాగిన పనులు
- ఆగస్టు నుంచి ప్రారంభం
- నూతనంగా ఏటీసీ సెంటర్
- ఉద్యోగ అవకాశాలు కల్పించే ఆరు కోర్సులు



నిర్మాణపనులు జరుగుతున్న ఐటీఐ భవనం

దుబ్బాకటౌన్: పదో తరగతి పూర్తయిన విద్యార్థులను పారిశ్రామిక రంగంలో వృత్తి శిక్షణ కలిగిన నిపుణులుగా తయారుచేసి, వారికి ఉపాధి చూపించేలా ఐటీఐ (ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్)ను ప్రభుత్వం ప్రతి జిల్లాలో ఏర్పాటు చేసింది. దీనిలో భాగంగా 2012లో దుబ్బాకలోని ఒక అద్దె భవనంలో ఐటీఐని ప్రారంభించారు.

రూ.5 కోట్లతో..

ఐటీఐ భవన నిర్మాణానికి దుబ్బాక 16వ వార్డు పరిధిలో నాలుగెకరాల స్థలాన్ని కేటాయించారు. రూ.5 కోట్లతో 2018లో మాజీ మంత్రి హరీశ్‌రావు పనులకు శంకుస్థాపన చేశారు. ఉపాధి, కార్మికశాఖకు చెందిన నిధులతో జీ ప్లస్‌ఒన్ తరహాలో ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో నిర్మాణ పనులు చేపట్టారు.

నత్తనడకన సాగుతూ..

ఆ భవన నిర్మాణ పనులు ప్రారంభించి ఏడేళ్లు కావస్తోంది. ప్రస్తుతం పనులు ముగింపు దశకు చేరాయి. దీని పక్కనే టాటాగ్రూపు సహకారంతో ఐటీఐ విద్యార్థులకు ఏటీసీ(అడ్వాన్స్ టెక్నికల్ సెంటర్- అధునాతన సాంకేతిక నైపుణ్య శిక్షణ కేంద్రం)ని



నూతనంగా నిర్మిస్తున్న ఏటీసీ సెంటర్

నిర్మిస్తున్నారు. ఇది కూడా పూర్తయితే ఐటీఐ మరింత అప్‌గ్రేడ్ కానుంది. కాంట్రాక్టర్ జాప్యంతో పనులు నత్తనడకన సాగాయని, ఇప్పటికి చివరి దశకు చేరుకున్నాయని అధికారులు చెప్తున్నారు. ఈ విద్యా సంవత్సరం అంటే ఆగస్టు నాటికి ఐటీఐని అందుబాటులోకి తీసుకురావడానికి కాంట్రాక్టర్, ఆర్అండ్‌బీ అధికారులు కృషిచేస్తున్నారు.

ఆరు రకాల కోర్సులు

ఐటీఐ భవనం, ఏటీసీ కేంద్రం అందుబాటులోకి వస్తే.. యేడాది వ్యవధిగల వివిధ కోర్సుల్లో చేరే అవకాశం ఉంటుంది. మ్యాను ప్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్లో 20 సీట్లు, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్‌లో 20 సీట్లు, ఆర్టీయస్‌యన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్‌లో 10 సీట్లు కొత్తగా రానున్నాయి. అలాగే రెండేళ్ల వ్యవధి గల బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫయర్(మెకానికల్)లో 24 సీట్లు, అడ్వాన్స్‌డ్ సీఎన్సీ మెషినింగ్ టెక్నీషియన్‌లో 24 సీట్లు, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్స్‌లోను సీట్లు అందుబాటులోకి రానున్నాయి. విద్యార్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని ఐటీఐ ప్రిన్సిపాల్ కనకయ్య తెలిపారు.

అందుబాటులోకి వచ్చేలా కృషి



ఐటీఐ భవన నిర్మాణం చివరి దశకు చేరుకుంది. కాంట్రాక్టర్ పనులలో జాప్యం వహించడం వల్ల ఆలస్యమైంది. ఈ ఆగస్టు నాటికి ప్రభుత్వ ఐటీఐ, ఏటీసీ కేంద్రాలను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొస్తాం.

- వెంకటేశం, ఆర్అండ్‌బీ డీఈ, దుబ్బాక

పెరగనున్న విద్యార్థుల సంఖ్య



ఐటీఐ, ఏటీసీ భవనాలు అందుబాటులోకి వస్తే విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. అలాగే విద్యార్థులకు మంచి ఉపాధి కల్పించే కోర్సులు నేర్చుకొనే వీలుంటుంది. దీంతో వారు జీవితంలో స్థిరపడేందుకు అవసరమైన ఉద్యోగాలు, ఉపాధి పొందేందుకు ఆస్కారం ఉంటుంది.

- కనకయ్య, ఐటీఐ ప్రిన్సిపాల్, దుబ్బాక



పందిల్లలోని రైసుమిల్లు వద్ద బారులు తీరిన ధాన్యం ట్రాక్టర్లు

బారులుతీరిన వాహనాలు

ట్రాక్టర్ యజమానుల పడిగాపులు

హుస్నాబాద్‌రూరల్: యాసంగి కోతలు మొదలు కావడం.. కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యాన్ని విక్రయించడంతో మిల్లులకు ధాన్యం వాహనాలు బారులు తీరుతున్నాయి. పందిల్ల మిల్లు వద్ద ఆదివారం ఆధిక సంఖ్యలో ధాన్యం ట్రాక్టర్లు దర్శనమిచ్చాయి. దిగుమతి చేయడానికి వివిధ గ్రామాల నుంచి వచ్చి చేరిన ట్రాక్టర్ల యజమానులు క్యూలో నిరీక్షించారు. ఒక ట్రాక్టర్ ధాన్యం దిగుమతి చేయడానికి సుమారు మూడు గంటల సమయం పట్టడంతో ట్రాక్టర్ యాజమానులు మిల్లుల వద్దనే పడిగాపులు కాచారు. హమాలీల సంఖ్యను పెంచి దిగుమతి వేగంగా చేయాలని వారు కోరుతున్నారు.

'వక్ఫ్'పై బీఆర్ఎస్ వైఖరి ప్రకటించాలి

కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్



మాట్లాడుతున్న అత్తు ఇమామ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వక్ఫ్ సవరణ చట్టంపై బీఆర్ఎస్ వైఖరి ప్రకటించాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఆమోదించిన వక్ఫ్ సవరణ చట్టంపై బీఆర్ఎస్ ఎందుకు మౌనంగా ఉంటుందో తెలపాలన్నారు. దేశంలో ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వంలో మైనారిటీలకు అందించిన 4 శాతం రిజర్వేషన్ ఇప్పటికీ అమలు అవుతోందని చెప్పారు. కేవలం ఎన్నికలప్పుడు ముస్లింల ఓట్లు దండుకునేందుకు 12 శాతం రిజర్వేషన్ ఇస్తామని చెప్పిన బీఆర్ఎస్ పదేళ్ల పాటు కాలయాపన చేసిందని ఆరోపించారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్‌హుస్సేన్ ముస్లింలపై ప్రేమ కురిపించడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. బీజేపీ తీసుకున్న ప్రతి నిర్ణయంలో బీఆర్ఎస్ సహకరిస్తోందని, ఆ రెండు పార్టీలు తోడుదొంగలేనని ప్రజలకు అర్థమైందని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్తారని, మైనార్టీలు కాంగ్రెస్ వైపే ఉన్నారన్నారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి గ్యాదరి మధు, యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గయాజొద్దీన్, పట్టణ మైనార్టీ అధ్యక్షుడు సలీం, ఫయాజ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఫౌండేషన్ సేవలు అభినందనీయం

ఎమ్మెల్యే పల్లారాజేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలో బీఆర్ఆర్ ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మండలంలోని పేద ప్రజలు, విద్యార్థులకు ఆర్థిక సాయం అందిండటం, అలాగే క్రీడాకారులకు ప్రోత్సాహకాలు అందించడం సంతోషంగా ఉందన్నారు. అదే విధంగా మండలంలో ఎవరైనా నిరుపేదలు మరణిస్తే వారి ఇంటికి వెళ్లి ఆర్థిక సాయం అందించడం గొప్పవిషయమని కొనియాడారు. భవిష్యత్‌లో ఫౌండేషన్ సేవలు మరింత ఎక్కువ మందికి అందేలా చూడలని సూచించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, కిషన్, మాజీ జెడ్పీటీసీ సిద్దప్ప, శ్రీధర్, నర్సింహులు, స్వామి, వంశీధర్‌రెడ్డి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

నూతనోత్సాహం నింపిన వేడుకలు

- డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి
- ఘనంగా జెడ్పీ హైస్కూల్ వార్షికోత్సవం



'నో డ్రగ్స్' విద్యార్థుల సందేశాత్మక ప్రదర్శన

వర్గల్(గజ్వేల్): ఉన్నత పాఠశాల వార్షిక వేడుకలు అందరిలో నూతనోత్సాహం నింపాయని డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పాఠశాల ప్రాంగణంలో హెచ్ఎం వెంకటేశ్వర్‌గౌడ్ అధ్యక్షతన శనివారం రాత్రి నిర్వహించిన స్థానిక జెడ్పీ హైస్కూల్ వార్షికోత్సవం ఉత్సాహంగా సాగింది. విద్యార్థుల ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. బాంగ్రా, లంబాడి, హర్యానా, కేరళ నృత్యాలు జాతీయ సమైక్యతను చాటాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన డీఈఓ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను ఉపాధ్యాయులు సమర్థవంతంగా వినియోగించుకున్నపుడే అద్భుత ఫలితాలొస్తాయన్నారు. పీఎం శ్రీ పథకం ద్వారా వర్గల్ స్కూల్‌కు అటల్ టింకరింగ్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, వొకేషనల్ కోర్సులు, ఆధునిక వసతులు సమకూరాయని చెప్పారు. పాఠశాల రూపొందించిన ఈ–మేగజైన్, త్రైమాసిక ఆన్‌లైన్ ప్రగతి పుస్తకం ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ సునీత, లయన్స్ క్లబ్ ప్రతినిధులు సూర్యరాజు, అమర్‌నాథ్, ఏఏపీసీ చైర్మన్ భవాని తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తల కూలి పనులు



బస్తాలు మోస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

నంగునూరు(సిద్దిపేట): బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు తరలి వెళ్లేందుకు ఆ పార్టీ కార్యకర్తలు ఆదివారం గట్లమల్యాలలో కూలి పనులు చేశారు. గ్రామానికి చెందిన బుద్ధి తిరుపతి చేనులో బస్తాలు మోయగా రూ.5వేలు, అలాగే పుట్ట మధు రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో వేణుగోపాలచారి, ప్రకాశ్‌రెడ్డి, బాబు, వెంకటయ్య, శ్రీనివాస్, వెంకటేశ్, భిక్షపతి, పరశురాములు, రాజు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయంలో పూజలు

కొమురవెల్లి(సిద్దిపేట): బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు పిడిశెట్టి రాజు కొమురవెల్లి మల్లన్న ఆయలంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ కోసం ఉద్యమించి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన గొప్పనాయకుడు కేసీఆర్ అన్నారు. రాష్ట్రం ఏర్పాటు తర్వాత అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన ఘనత కూడా ఆయనకే దక్కుతుందని చెప్పారు. సభకు ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

బాధిత కుటుంబాలకు బీఆర్ఎస్ నాయకుల పరామర్శ

తొగుట(దుబ్బాక): మండలంలోని తుక్కాపూర్‌లో ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందిన సాయి ప్రణీత్ కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకులు ఆదివారం పరామర్శించారు. ప్రమాద ఘటన గురించి బాలుడి తండ్రి చిక్కుడు స్వామిని అడిగి తెలుసుకున్నారు. సంతోషంగా పండుగ జరుపకోవాల్సిన కుటుంబంలో బాలుడి మృతి చెందడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మాజీ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ కొమురయ్య, నాయకులు లక్ష్మారెడ్డి, రాములు, బాల్‌రాజు, లక్ష్మణ్‌ఆజం, మల్లేశం పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

జీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి రవీందర్



మామిడి కాయలను పరిశీలిస్తున్న రవీందర్‌గౌడ్

అక్కన్నపేట(హుస్నాబాద్): అకాల వర్షం వల్ల నేలరాలిన మామిడి, పంటలు దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి రవీందర్ డిమాండ్ చేశారు. మండలంలోని మల్‌చెర్వుతండా, రేగొండ గ్రామాల్లో ఇటీవల అకాల వర్షంతో దెబ్బతిన్న మామిడితోటలను ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కంటికి రెప్పలా కాపాడుకుంటున్న మామిడి చెట్లు నేలకొరగడం తీరని నష్టమన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతీసుకొని నష్టపరిహారం త్వరగా వచ్చేలా కృషి చేయాలని కోరారు.

నిరాశ్రయులకు సహాయం

సిద్దిపేటజోన్: అఖిల భారత బ్యాంక్ ఉద్యోగుల సంఘం 80వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పలువురు నిరాశ్రయులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. మున్సిపల్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరాశ్రయుల భవన్‌లో ఉండేవారికి ఆదివారం 100 కిలోల నిత్యావసర వస్తువులు అందజేసినట్టు ఉద్యోగులు తెలిపారు.

ఈస్టర్ వేడుకలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఆపదలో ఉన్న మనతోటి వారికి అండగా నిలువాలని, ఇదే ఏసుప్రభు చూపిన మార్గమని సీఎస్ఐ చర్చి రెవరెండ్ ఆంథోని అన్నారు. స్థానిక సీఎస్ఐ చర్చిలో ఆదివారం ఈస్టర్‌డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేసి గీతాలు ఆలపించారు.

సీఎంకు పీపీ జీవన్‌రెడ్డి కృతజ్ఞతలు



మాట్లాడుతున్న అడ్వకేట్ జీవన్‌రెడ్డి

సిద్దిపేటకమాన్: తనకు రాష్ట్ర ప్రభుత్వ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా అవకాశం కల్పించినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు అడ్వకేట్ జీవన్‌రెడ్డి తెలిపారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా కోర్టుకు మొట్టమొదటి రెగ్యులర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా రాష్ట్ర ప్రభుత్వం తనకు అవకాశం కల్పించిందన్నారు. బాధితులకు న్యాయం జరిగేంత వరకు పోరాడడంతో పాటు నిందితులకు శిక్షలు పడే విధంగా తన వంతు ప్రయత్నం చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో అడ్వకేట్ పత్రి ప్రకాశ్, ఖలిమొద్దీన్ పాల్గొన్నారు.

ఘనంగా శిఖర ప్రతిష్ఠ మహోత్సవం



శిఖర ప్రతిష్ఠ చేస్తున్న అర్చకుడు శ్రీనివాసాచార్యులు

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని లక్ష్మీవెంకటేశ్వర స్వామి దేవాలయ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం శిఖర ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకుడు శేషం శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ సోమవారం నుంచి ఐదు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వృథాగా 'విలేజ్ మార్కెట్'

కూరగాయలు అమ్ముకునే వారి జీవనానికి ఉపయోగపడాల్సిన 'విలేజ్ మార్కెట్'లు అలంకార ప్రాయాలుగా మారుతున్నాయి. సరైన స్థలంలో నిర్మిస్తే అమ్మకందారులకు, కొనుగోలుదారులకు ఉపయుక్తంగా ఉంటుంది. కాని ములుగు మండలం చిన్నతిమ్మాపూర్(వంటిమామిడి)లో మార్కెట్‌ను ఓ మూలన నిర్మించారు. దీంతో ఆ విలేజ్ మార్కెట్ నిరుపయోగంగా మారింది.

దూరంగా ఉండటంతో నిరుపయోగం

- రోడ్డుపక్కన కూరగాయల విక్రయాలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- చిన్నతిమ్మాపూర్‌లో వ్యాపారుల అగచాట్లు



చిన్నతిమ్మాపూర్‌లో వృథాగా ఉన్న విలేజ్ మార్కెట్ ప్రాంగణం



మార్కెట్ ప్రాంగణంలో ఖాళీ మద్యం సీసాలు, చెత్తాచెదారం

ములుగు(గజ్వేల్): ములుగు మండలం వంటిమామిడి నుంచి తున్కిబొల్లారం మార్గంలో చిన్నతిమ్మాపూర్ వద్ద రోడ్డుపక్కనే కూరగాయల విక్రయాలు నిర్వహిస్తారు. నిత్యం వాహనాల రద్దీ ఉండటంతో వారంతా ప్రమాదాల నీడలోనే కూరగాయలు అమ్ముకొనేవారు. అయితే వారి కోసం రూ.15లక్షల ఈజీఎస్, పంచాయతీ నిధులు వెచ్చించి యేడాదిన్నర క్రితం 'విలేజ్ మార్కెట్' నిర్మించారు. దాదాపు అరెకరం విస్తీర్ణంలో అంతర్గత రోడ్డులో 28 దుకాణాలు ఏర్పాటు చేసుకునేలా మార్కెట్ షెడ్డు నిర్మించారు. గ్రామపంచాయతీకి ఆదాయం, కూరగాయల విక్రేతలకు ప్రయోజనం కలిగించే ఈ మార్కెట్ సముదాయంలో దుకాణాలను మాత్రం ఎవరికీ కేటాయించలేదు. దీంతో అది అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది.ఆవరణంతా పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో నిండిపోయింది. శిథిలావస్థకు చేరుకుంటోందని స్థానికులు వాపోతున్నారు.

బస్‌షెల్టర్‌లో కూరగాయల సామగ్రి



గ్రామానికి చెందిన కూరగాయల అమ్మకందారులకు ప్రత్యేకమైన స్థలం లేకపోవడంతో రోడ్డుపక్కనే వారు విక్రయాలు సాగిస్తున్నారు. అయితే వారు ప్రయాణికుల కోసం నిర్మించిన బస్‌షెల్టర్‌ను కూరగాయల అడ్డాగా మార్చేశారు.

అద్దె ప్రాతిపదికన తీర్మానం

రోడ్డుపక్క కూరగాయలు విక్రయించుకునే వారికోసం ఈజీఎస్, జీపీ నిధులతో విలేజ్ మార్కెట్ నిర్మింపజేశాం. అందులో 28 దుకాణాలు ఏర్పాటు చేసుకోవచ్చు. అందుకుగాను నెల వారీ అద్దె ప్రాతిపదికన దుకాణాలు కేటాయించాలని తీర్మానం కూడా చేశాం.

- హంస మహేశ్, మాజీ సర్పంచ్

వినియోగంలోకి తెస్తాం..

చిన్నతిమ్మాపూర్‌లో విలేజ్ మార్కెట్ వృథాగా ఉన్న విషయం వాస్తవమే. 28 దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు సౌలభ్యం ఉంది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి మార్కెట్‌ను త్వరలోనే వినియోగంలోకి తెచ్చేలా చూస్తాం.

- మేరీ స్వర్ణకుమారి, ఎంపీడీఓ, ములుగు